www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 జులై 2025

5

పశ్చిమ గోదావరి



స్కూల్ బస్సుల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా డిటిఒ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి సరైన పత్రాలు లేని రెండు ప్రయివేట్ స్కూల్ బస్సులపై కేసు నమోదు చేసినట్టు తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.నాయక్ తెలిపారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బలక్ష్మితో కలిసి శనివారం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. పిప్పర మండల పరిధిలో టాక్స్, ఎఫ్‌సి లేకుండా తిరుగుతున్న రెండు స్కూల్ బస్సులను తనిఖీ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.39 వేల అపరాధ రుసుమును వసూలు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్ తెలిపారు.


బాలింతలు బెంబేలు..!

'నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన మహిళ ప్రసవం కోసం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నెల రోజుల క్రితం చేరింది. ఇప్పటికీ ఆమె ఆసుపత్రిలోనే ఉంది. ఇన్ఫెక్షన్ పేరుతో తాజాగా మరోసారి కుట్లు వేశారు. ఇంటికి ఎప్పటికి వెళ్తామో అంటూ బాలింత, ఆ కుటుంబం భయంతో వణికిపోతుంది.'

'ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన గర్భిణి ఎనిమిది రోజుల క్రితం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరింది. కాన్పు జరిగి వారం రోజుల తర్వాత ఇన్ఫెక్షన్ అయ్యిందని, మరోసారి కుట్లు వేయాల్సి వస్తుందని చెప్పడంతో ఆమె బాధ వర్ణనాతీతంగా మారింది.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న బాలింతలే కాదు.. ఆసుపత్రిలో ప్రసవమైన బాలింతల్లో చాలామంది పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఆసుపత్రి నుంచి ఇంటికి ఎప్పటికి వెళ్తారో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే ఆసుపత్రిలో ఉన్న బాలింతల్లో 12 శాతం మందికి ఇన్ఫెక్షన్ పేరుతో పదేపదే కుట్లు వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక లెక్కల కంటే ఇది మరింత ఎక్కువగా ఉందని గర్భిణుల బంధువులు చెబుతున్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ప్రసవాలు చేయడంలో తల్లీబిడ్డల ఆసుపత్రికి మంచి పేరు ఉంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఎంతోమంది ఇక్కడకు తరలొచ్చి పండంటి బిడ్డలకు జన్మనిచ్చి సంతోషంగా తిరిగెళ్లేవారు. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి మొత్తం తారుమారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ (తల్లీబిడ్డల విభాగం) బ్లాక్‌కు ప్రతిరోజూ కనీసం 150 మందికిపైగా గర్భిణులు వస్తుంటారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా మారుతోంది. దానికి తోడు ఇన్ఫెక్షన్ పేరుతో బాలింతలకు పదే పదే కుట్లు వేస్తున్న తీరు బాలింతలను, ఆయా కుటుంబాలను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రతిరోజూ ఆరోగ్యశ్రీ ద్వారా పది మందికిపైగా గర్భిణులకు ప్రసవాలు జరుగుతుంటాయి. నిబంధనల ప్రకారం ఎనిమిది రోజులకు డిశ్చార్జి చేసి పంపించాలి. ఇక్కడ చేరిన గర్భిణులు ప్రసవం తర్వాత ఎన్ని రోజులకు తిరిగెళ్తారో చెప్పలేని పరిస్థితి ఉంది. ఇన్ఫెక్షన్ పేరుతో పదేపదే కుట్లు వేస్తుండటంతో రోజులు తరబడి ఆసుపత్రిలోనే మగ్గిపోతున్నారు. వేరే ఆసుపత్రికి తీసుకెళ్తాం.. పంపించేయండి బాబోయ్ అంటూ బాలింతల కుటుంబ సభ్యులు డాక్టర్లను వేడుకుంటున్న పరిస్థితి ఉంది.



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తల్లిబిడ్డల ఆసుపత్రి

గతంలో లేనిది ఇప్పడే ఎందుకు..?

జిల్లా ఆసుపత్రిగా లేని సమస్య బాలింతల విషయంలో ఇప్పుడే ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు. వైద్యులు చెబుతున్న కారణాలు సహేతుకంగా ఉండటం లేదు. బాలింతలు ఉండే చోట సామాన్లు, చూడడానికి వచ్చేవారి కారణంగా ఇన్ఫెక్షన్ వస్తుందని కారణాలు చెబుతున్నారు. వాస్తవానికి జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడూ ఇదేవిధంగా కొనసాగేది. అప్పుడు బాలింతలు ఆరోగ్యంగా ఇంటికి వెళ్లేవారు. ఇప్పుడు ఎందుకు ఈవిధంగా జరుగుతుందో సరైన కారణం మాత్రం చెప్పడం లేదు. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ బాలింతలకు పదేపదే కుట్లు వేస్తున్న విషయాన్ని లేవనెత్తారు. ఇప్పటికే బాలింతలకు ఇన్ఫెక్షన్‌పై ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి బాధితులు అనేకసార్లు తీసుకెళ్లారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

ఆసుపత్రికి రాకూడదంటూ చర్చ

ఇక్కడ ప్రసవం చేసుకున్న మహిళలు ఇంకెవ్వరూ ఇక్కడికి రావొద్దని తమ వద్దకు వచ్చిన వారికి చెబుతున్న పరిస్థితి ఉంది. దీంతో ఆసుపత్రి ప్రతిష్ట రోజురోజుకీ మసకబారుతోంది. ఇదేవిధమైన పరిస్థితులు కొనసాగితే కొంతకాలానికి గర్భిణులు ఈ ఆసుపత్రికి వచ్చే పరిస్థితి ఉండదనే చర్చ సాగుతోంది. ఇన్ఫెక్షన్‌కు సంబంధించి ఆసుపత్రి శుభ్రతపై ఏమైనా టెస్టులు నిర్వహించారా.. వాటిలో తేడాలు వచ్చాయా.. ఏం చర్యలు తీసుకున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జిల్లా, ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రి తల్లీబిడ్డల బ్లాక్‌లో పరిస్థితి దారుణం

బాలింతలకు ఇన్ఫెక్షన్ పేరుతో పదేపదే కుట్లు వేస్తుండటంతో నరకయాతన

సుమారు నెల రోజులు ఆసుపత్రిలోనే ఉంచేస్తున్నారని ఆందోళన

ఏడాదిగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువు

ఆసుపత్రికి వచ్చేందుకు వణికిపోతున్న గర్భిణులు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఇదే విషయం లేవనెత్తిన ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

శశిధర్, జిజిహెచ్ సూపరింటెండెంట్

బాలింతలకు ఇన్ఫెక్షన్ సమస్య నా దృష్టికి వచ్చింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రి బెడ్స్ ఏర్పాటు, పలు విషయాలపై ఆలోచన చేస్తున్నాం.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, నేతలు

మా స్కూల్ మాకు కావాలి

కొనసాగిన పెనుమంట్ర ఎల్ఇ పాఠశాల విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

'మా స్కూల్ మాకు కావాలి' అంటూ మండల కేంద్రంలోని మండల పరిషత్ ఎల్ఇ పాఠశాల 3, 4, 5 తరగతుల విద్యార్థులు చేపట్టిన పోరాటం శనివారం మరింత ఉధృతం చేశారు. స్కూల్ వెలుపల లూథరన్ చర్చి సమీపంలోని రోడ్డుపై ఏర్పాటు చేసిన శిబిరంలో ప్ల కార్డులు చేతబట్టుకుని నినాదాలు చేశారు. సుమారు 27 మంది విద్యార్థులను రక్షణ గోడలు లేని పెద్ద చెరువు వద్ద ఉన్న మెయిన్ పాఠశాలకు తరలించడం దారుణమని ఆ గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. ఈ పాఠశాలలో 1 నుండి 5 వరకూ తరగతులు పూర్వం ఎలా నడిచేవో యథాతథ పరిస్థితి కొనసాగించాలని, అప్పటి వరకూ ఆందోళన విరమించేది లేదని కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు అన్నారు. ఈ ఆందోళనకు సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, గ్రామ ఉపసర్పంచి భూపతిరాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షులు భరత్ కుమార్ సంఘీభావం తెలిపారు.

పిఎం లంక అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అవసరం

జిల్లా కలెక్టర్ నాగరాణి

పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంఎల్‌ఎ నాయకర్, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అనిరుధ్


గోడ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అనిరుధ్, కలెక్టర్, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దత్తత గ్రామం పిఎం లంక అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పిఎం లంక గ్రామంలో డెలాయిట్ కంపెనీ సిఎస్ఆర్ ఫండ్స్‌తో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అనిరుధ్ ఎస్ పులిపాక సంయుక్తంగా శనివారం పరిశీలించారు. తొలుత పిఎం లంక డిజిటల్ భవన్‌కు చేరుకుని అక్కడ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు ఏఏ ప్రాంతాల నుండి వచ్చి శిక్షణ పొందుతున్నారు తదితర వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో వంద గృహాలకు పిఎం సూర్యఘర్ కింద సోలార్ ప్యానల్స్ మంజూరు చేశారని, గ్రామంలోని అన్ని ఇళ్లకూ సోలార్ ప్యానల్స్ ఉచితంగా అందించాలని కోరారు. ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పిఎం లంక గ్రామం సముద్రపు కోతకు గురై ముంపునకు గురికావడంతో కనుమరుగయ్యే పరిస్థితి ఉందని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న కేంద్ర మంత్రి ప్రస్తుతం రూ.13.75 కోట్ల వ్యయంతో డిలైట్ కంపెనీ చేపట్టిన సముద్రపు కోత నిరోధక అడ్డుకట్ట నిర్మాణం అక్టోబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అనిరుధ్ ఎస్ పులిపాక మాట్లాడుతూ మంత్రి నిర్మలా సీతారామన్ గ్రామాభివృద్ధికి చేపట్టిన పనుల పర్యవేక్షణకు వచ్చామని, గ్రామస్తులు చెప్పిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం "జియో టెక్స్‌టైల్ ట్యూబ్ సీవాల్" (సముద్రపు రక్షణ గోడ) నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిలైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఎన్ని కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టారు, నిర్మాణం ఎన్ని దశల్లో ఏ విధంగా జరుగుతుంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రక్షణ గోడ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి వ్యక్తిగత సహాయకులు విష్ణుసింగ్, నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, జలవనరుల శాఖ ఎస్ఇ నాగార్జున, ఇఇ సత్యనారాయణ, ఎఇ రమణ, జిఎస్‌డబ్ల్యూ అధికారి వై.దోసిరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథ్‌బాబు, డిలైట్ కంపెనీ సీనియర్ కన్సల్టెంట్ అభయ్‌వర్మ, పెదమైనవానిలంక సర్పంచి కె.కనకదుర్గ, తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

9న జాతీయ సమ్మె పాలకులకు కనువిప్పు కావాలి

ప్రచార జాతాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె కేంద్ర, రాష్ట్ర పాలకులకు కనువిప్పు కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అన్నారు. సమ్మె జయప్రదం చేయాలని చేపట్టిన ప్రచార జాతాను శనివారం మూడో రోజు భీమవరంలో ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల పేరుతో ఉద్యోగ, కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ నిర్ణయం చేసిందన్నారు. నిరుద్యోగం, అధిక ధరలు, గిట్టుబాటు ధర సమస్య, తాగునీరు, ఇళ్ల స్థలాలు, విద్య, వైద్యం సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, కె.ఝాన్సీలక్ష్మి, ఇంజేటి శ్రీనివాస్, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎపి ఎంఎస్‌ఆర్‌యు నాయకులు సూర్యచంద్రరాజు, బజారు జట్టు కార్మిక సంఘం నాయకులు కృష్ణ, డేగల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు సివిల్ సప్లయీస్ యూనియన్ నాయకులు కోదండం పాల్గొన్నారు.



జెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కాళ్ల: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలని, యజమానులకు మేలు చేసి, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 9న సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ జీపుజాతా మండలం మీదుగా శనివారం సాగింది. పెదఅమిరంలో ప్రారంభమైన యాత్ర కోపల్లె, సీసలి, కాళ్ల, జువ్వలపాలెం, ఏలూరుపాడు మీదుగా ఆకివీడు చేరుకుంది. పలు ప్రధాన సెంటర్లలో జరిగిన సభల్లో వాసుదేవరావు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి దూసి కళ్యాణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఝాన్సీరాణి, నాయకులు మండా సూరిబాబు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీను, గొర్ల రామకృష్ణ, పైడితల్లి, దగ్గులూరి అనిత, గణేష్ పాల్గొన్నారు.

ఆకివీడు: లేబర్ కోడ్‌ల రద్దు, కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల తొమ్మిదిన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. సమ్మె సందర్భంగా చేపట్టిన ప్రచార జాతా శనివారం ఆకివీడు చేరింది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సభలో వాసుదేవరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ యత్నాలు వెంటనే నిలుపుదల చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మల్లిపూడి ఆంజనేయులు, లారెన్స్, బి.కళ్యాణి, ఇంజేటి శ్రీను, పెంకె అప్పారావు, బి.రాంబాబు, బుర్ర సత్యం, నిమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడులో మాట్లాడుతున్న వాసుదేవరావు

ఉండి: కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా చర్యలు చేపట్టిన ప్రధాని మోడీ తీరును నిరసిస్తూ ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆంజనేయులు, కార్యదర్శి బురిడి వాసుదేవరావు పిలుపునిచ్చారు. శనివారం ఉండి మెయిన్ సెంటర్‌కు సిఐటియు ప్రచార జాతా చేరుకుంది. ఈ సందర్భంగా వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడారు. ప్రజలను మోసగిస్తూ బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ధనికొండ శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, దూసి కళ్యాణి, ఇంజేటి శ్రీనివాస్, కోదండం, ఝాన్సీ, వీరవల్లి మాధవరావు, వీరవల్లి శ్రీనివాస్, నిమ్మితి కిషోర్, పెల్లూరి సుబ్రహ్మణ్యం, కురిటి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అష్టకష్టాలు.. స్పందించని పాలకులు..!

పాఠశాలల, తరగతుల విలీనంతో విద్యార్థులు, ధాన్యం సొమ్ములు అందక రైతులు అష్ట కష్టాలు పడుతున్నా పాలకుల నుంచి సరైన స్పందన లేకుండా పోయింది. వాళ్ల సంగతి పక్కన పెట్టి జిల్లా అధికారులైనా స్పందిస్తారంటే అదీ లేకపోవడంతో రెండు జిల్లాల్లో ఆయా తరగతుల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పాఠశాలల, తరగతుల విలీనంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా సమీప పాఠశాలల్లోనే అంటే అర కిలోమీటరు దూరంలోనే కొన్ని తరగతులను విలీనం చేసినా, అక్కడికి వెళ్లడానికి ప్రధాన రహదారులు దాటాల్సి రావడం, లేదా కాల్వల పక్కగా రాకపోకలు సాగించాల్సి రావడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మండల, డివిజన్ విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. వాటిలో ఈ ఇబ్బందులను సైతం పేర్కొన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే అవేమీ పట్టని పాలకులు తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనే చందంగా పాఠశాలల, తరగతుల విలీన ప్రక్రియ కానిచ్చేశారు. అదే సమయంలో ఎక్కడైనా అధికార పార్టీ ఎంఎల్‌ఎలు జోక్యం చేసుకుంటే వాటి వరకూ కొంత ఆగింది. మిగిలిన చోట్ల ఈ విలీన ప్రక్రియ అధికారుల మెడకు చుట్టుకుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. విలీనానికి వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడంతో మండలాధికారులు సర్దిచెప్పలేక నానాతంటాలు పడుతున్నారు. ఇదే కోవలో పెనుమంట్రలోని ఎల్ఇ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేయడంపై ఇప్పటికీ ఆందోళనలు సాగుతున్నాయి.



ఇక ఉపాధ్యాయుల బదిలీలు సక్రమంగా, సమతూకంగా సాగలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏజెన్సీలోని కుక్కునూరు మండలంలో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ కావడమే దీనికి నిదర్శనం. 114 ఉపాధ్యాయ పోస్టులకుగాను 38 మంది ఉపాధ్యాయులే ఉండటం, వారిలో 18 మంది డిప్యూటేషన్‌పై వెళ్లి పని చేస్తున్న వారే కావడం అక్కడి పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు జిల్లా అధికారులు అక్కడి ఖాళీల భర్తీ ఎలా చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

ఇదిలా ఉండగా ఏలూరు నగరంలో ఉర్దూ పాఠశాలలో ఉర్దూ మీడియంలో బోధించే ఉపాధ్యాయులను ఇంగ్లీష్ మీడియంలో బోధించే పాఠశాలకు బదిలీ చేయడం, ఇంగ్లీష్ మీడియంలో బోధించే ఉపాధ్యాయులను ఉర్దూ పాఠశాలకు బదిలీ చేయడం సరికొత్త తలనొప్పిని తీసుకొచ్చింది. అడ కత్తెరలో పోకచెక్కలో విద్యాశాఖాధికారుల నిర్వాకం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధి కారులు ప్రయోగాలు మాని విద్యారంగ అభివృద్ధికి దోహద పడే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇక సార్వా సాగు పనులు ప్రారంభమయ్యాయి. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని సిఎం నుంచి మంత్రులు, ఎంఎల్‌ఎలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. అయితే మే రెండో వారం నుంచి రైతులకు ధాన్యం సొమ్ము జమ నిలిచిపోయింది. ఇటీవల రైతులు ఆందోళన చేపడితే రూ.500 కోట్ల బకాయిలకుగాను సగం వరకూ చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. మిగిలిన సగం ఎప్పటికి చెల్లిస్తారో, సార్వా సాగు ఎప్పుడు ప్రారంభించాలోనని రైతులు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికైనా గొప్పలు మాని పాలకులు, అధికారులు అటు విద్యార్థులు, ఇటు రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

14న 'కలెక్టర్‌కు చెప్పుకుందాం రండి'

కల్లుగీత కార్మికుల వినూత్న నిరసన


హాజరుకానున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

మొకులు, ముస్తాదులు ధరించి వేలాదిగా తరలి రానున్న గీత కార్మికులు

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాలు ఏలుతున్న.. ప్రజా ప్రతినిధులు మారుతున్న కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేసి గీత కార్మికులను విస్మరిస్తున్నారు తప్ప వారి సంక్షేమానికి, గీత వృత్తి అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి విమర్శించారు. ఎక్స్‌గ్రేషియా రద్దుచేసి, గీతకార్మిక కుటుంబాలను ప్రభుత్వం రోడ్డున పడేసి తీరని అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల ముందు గీత కార్మికులకు 340 మద్యం షాపులు కేటాయిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాటమార్చి మరోసారి మోసం చేసిందని మండిపడ్డారు. పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకట్లేదు గాని మద్యం మాత్రం కావలసినంత ఏరులై పారుతుందని, కల్లుపై మాత్రం కూటమి సర్కారు కక్ష కట్టిందని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు, మద్యం సిండికేట్లు, ఎక్సైజ్ అధికారులు మరో కుటమి ప్రభుత్వంలా ఏర్పడి కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. తమ గీత కార్మికుల సమస్యలు ఎంతమంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని, ఈనేపథ్యంలో ఈనెల 14వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద చేపట్టిన గీత కార్మికులారా.. కలెక్టర్ గారికి సమస్యలు చెప్పుకుందాం రండి కార్యక్రమంలో వేలాదిగా గీత కార్మికులు మోకులు, ముస్తాదులు ధరించి తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కలెక్టరేట్ వద్ద జరిగే వినూత్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం కల్లుగీత కార్మిక సంఘం భీమవరం డివిజన్ సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహామూర్తి మాట్లాడుతూ జిల్లాలో 4 వేల బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయని, వీటిని నియంత్రించడంలో ఎక్సైజ్ శాఖ విఫలమైందని విమర్శించారు. అక్రమ మద్యాన్ని, కల్తీ మద్యాన్ని అరికట్టకుండా, బెల్టుషాపులు తొలగించకుండా చేతిలెత్తేయడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో గీత కార్మికులకు ఏంచేసిందో చెప్పాలని ప్రశ్నించారు. సుపరిపాలనలో గీత కార్మికులు జీవన పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిదన్నారు. కూటమి ప్రభుత్వం గీత కార్మికుల కుటుంబాలపై కక్షగట్టి విచ్చలవిడిగా బెల్టుషాపులు పెట్టించి కల్లు అమ్మకాలు లేకుండా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తంచేశారు. అక్రమ మద్యం, కల్తీ మద్యం వరదలా పారుతోందన్నారు. గత ప్రభుత్వంలో బెల్టుషాపులు లేవని, అక్రమ మద్యం లేదని, కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు, మద్యం షిండికేట్లు, ఎక్సైజ్ శాఖ కలసి కూటమిగా ఏర్పడి రాజ్యాంగేతర శక్తిగా పాలిస్తున్నారని దుయ్యబట్టారు. బెల్టుషాపులు అమ్మితే బెల్టుతీస్తామన్న చంద్రబాబు చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. లక్షలో బెల్టుషాపులు వేలంపాట ఎక్సైజ్ శాఖకు తెలియకుండా జరిగాయా అని ప్రశ్నించారు. గీత కార్మికులు మామూళ్లు ఇవ్వలేరని, తాటికల్లు ఎంతగొప్పదైనా, ఎన్ని ఔషధ గుణాలు ఉన్నా.. రసాయనాల బ్రాందీ ముందు బలాదూర్ అన్నట్లుగా కూటమి ప్రభుత్వం కల్లును చిన్న చూపు చూస్తోందన్నారు. దీంతో కల్లు గీత కార్మికుల కష్టాలు, కన్నీళ్లను జిల్లా కలెక్టర్‌కు చెప్పుకునేందుకు ఈనెల 14న కలెక్టరేట్ వద్ద వినూత్న కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి హాజరు కానున్నారని, కార్మికులంతా మోకులు, ముస్తాదులు ధరించి తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమవావేశంలో చింతపల్లి చినవీరాస్వామి, తుంగ సాయిబాబు, కొప్పిశెట్టి వెంకట సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ : కలెక్టర్

భీమవరం : ఈనెల 10న జిల్లాలో పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించడం జరిగిందని, ఈ ఏడాది ప్రయివేటు పాఠశాలతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో కూడా పిటిఎం సమావేశాలు నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,931 ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల నుంచి విద్యార్థులు, వారి తల్లి దండ్రులతో కలసి హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో కూడా జిల్లాలోనున్న 102 జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు వారి తల్లి, తండ్రితో సహ హాజరుకానున్నట్లు తెలిపారు. పిల్లలే ఆహ్వానాలను తల్లి దండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్‌ను కూడా ఇస్తారని, తల్లిదండ్రులు ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశం లోపలే విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరిపి వారి ఆరోగ్యస్థితిపై 10న వారికి అందించే హెూలిస్టిక్ కార్డ్సులో రిమార్క్స్ కాలంలో రిపోర్ట్ చేసి ఇస్తారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానించడం జరుగుతుందని, అలాగే పూర్వ విద్యార్థులను, అక్కడే చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తులను కూడా ఆహ్వానించి సన్మానించడం జరుగుతుందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసే పలు పోటీలను నిర్వహించడం జరుగుతుందని, తల్లిదండ్రులకు కూడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందజేస్తామని తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం డిఎస్‌పి ఇ.విశ్వనాథ్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ బోనం ఆదిప్రసాద్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ సిబ్బంది పట్టణంలో ఉన్న కాలేజీలు, స్కూల్స్‌కు వెళ్లి శక్తి యాప్ ప్రాముఖ్యతను, ఎలా వినియోగించాలి అనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించినట్లు పట్టణ మహిళా పోలీసులు తెలిపారు. ఒంటరిగా వెళ్లే మహిళలు, విద్యార్థినులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే, మొబైల్‌లో శక్తి యాప్ ద్వారా ఎస్ఒఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులు వచ్చి సహాయ సహకారాలు అందిస్తారని మహిళా పోలీసులు విద్యార్థులకు వివరించారు. ప్రతిరోజు పలు విద్యాసంస్థలు, పనిచేస్తున్న కార్యాలయాల వద్ద పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించడం పట్ల పలు విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల రాజీ



తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 870 కేసులను రాజీచేసినట్లు 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. నాలుగు బెంచ్‌లుగా నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 19, క్రిమినల్ కేసులు 177, మెయింటెనెన్స్ కేసులు 8, ఫ్రీ లిటిగేషన్ కేసులు 30, బెంచ్ కోర్టు కేసులు 636 మొత్తం 870 కేసులను కక్షిదారుల మధ్య రాజీ కుదించినట్లు ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితా దేవి, జ్యుడీషియల్ మెంబర్లుగానూ, దూలం విజయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, తోట మురళీకృష్ణ, ఉంగరాల శివకుమార్, అడ్వకేట్ మెంబర్లుగా వ్యవహరించారు. ఈ లోక్ అదాలతో పాల్గొన్న కక్షిదారులకు తాడేపల్లిగూడెం ఆర్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ భోజన వసతులు ఏర్పాటు చేశారు.

తణుకు : తణుకు కోర్టులో చైర్మెన్, నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు 743 కేసులు రాజీ చేశారు. ఇందులో సివిల్ కేసులు 25, క్రిమినల్ కేసులు 115, బెంచ్ కోర్టు కేసులు 591, ఫ్రీ లిటిగేషన్ కేసులు 12 రాజీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయ్యమూర్తులు కె.కృష్ణసత్యలత, పొతర్లంక సాయిరాం, తాడి ఆంజనేయులు, బార్ అసోసియేసన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, కౌరు వెంకటేశ్వర్లు, చోడే గోపికృష్ణ, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 320 కేసులు పరిష్కరించినట్లు నర్సాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు తెలిపారు. ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం వల్లనే ఆయా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ చేయడం జరిగిందన్నారు. ఈ అదాలత్‌లో మొత్తం 320 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీచేసినట్లు గంగరాజు పత్రికలకు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను 3 బెంచ్‌లుగా ఏర్పాటుచేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తి సివిల్ జడ్జి గంగ రాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్.రాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 183 కేసులు పరిష్కరించడం జరిగిందని బార్ అధ్యక్షులు ఆర్‌వి సూర్యనారాయణ తెలిపారు. తద్వారా బాధిత కక్షిదారులకు రూ.1,32,32,835 వివిధ కేసుల్లో పరిహారంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఒక కోర్టులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియా ఉద్దీన్, మరొక కోర్టులో లక్ష్మీ లావణ్య సారధ్యం వహించారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కాలేజీలో బిఎస్‌ఇ విద్యార్థులకు బోధన చేయుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అభ్యర్థి సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పిజి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలని, పిహెచ్‌డినెట్ లేదా ఎస్ఇటి బోధనానుభవం కలిగినవారికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 14వ తేదీలోపు అన్ని సర్టిఫికెట్‌లతో కళాశాలలో అందజేయాలని, మరిన్ని వివరాల కోసం 7901056668 నెంబర్‌కి ఫోన్ చేయాలని తెలియజేశారు.

నేడు ఉచితంగా ర్యాబిస్ నివారణా టీకాలు

నరసాపురం : ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన నరసాపురం ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నివారణా టీకాలు ఇస్తామని ఇన్‌ఛార్జి ఎడి డాక్టర్ ఐ.సురేంద్రకుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పశువుల ఆసుపత్రుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకూ టీకాలు వేస్తామన్నారు. రైతులు, పెంపుడు కుక్కల యాజమానులు వినియోగించుకోవాలన్నారు.

పాలకొల్లు : జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పాలకొల్లు యడ్ల బజార్‌లోని పశు వైద్యశాలలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కుక్కలు, ఇతర పెంపుడు జంతువులకు ర్యాబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేయబడునని మున్సిపల్ కమిషనర్ విజయసారధి తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

18 నుంచి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

తణుకు : ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలో ఉన్న చిట్టూరి సుబ్బారావు, సత్యఉషారాణి స్టేడియంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బ్యాట్మెంటన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టూరి సత్యఉషారాణి, సెక్రటరీ మెంటే వంశీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు అండర్ 11, 13, 15, 17, 19 బాల బాలికలకు, పురుషులు, మహిళలు అలాగే వెటరన్స్ 35+,40+,45+,50+,55+,60+,65+,70+ వయస్సుల విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్ విభాగంలో ఉంటాయని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో, జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. ఈ పోటీలను ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ కాలేజ్ స్పాన్సర్ చేస్తున్నారని ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ కాలేజ్ జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు తెలియజేశారు. పోటీల వివరాలకు టోర్నమెంట్ ఆర్గనైజన్, కార్యదర్శి ఎస్.సతీష్‌బాబు సెల్ నెంబర్లను 9849666223, 9701404675 సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

పాలకొల్లు : పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నిత్య అన్నదానంనకు ఘరిమెల్ల నాగవెంకట రవిశంకర్-సీత దంపతులు(కాకినాడ) రూ.50 వేల విరాళం అందించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముచ్చెర్ల శ్రీనివాస్‌కి విరాళంగా అందజేశారు. విరాళంగా అందజేసిన దాతను శాలువాతో సత్కరించి, స్వామివారి ఫొటో, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సుపరింటెండెంట్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్ అమలు చేయాలి

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహమ్మద్ అలీ

తాడేపల్లిగూడెం : 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే అమలు చేయాలని, ప్రయాణికులకు అనుగుణంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహమ్మద్ అలీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంటు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాడేపల్లిగూడెం ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి అలీ ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, లేనిఎడల ఐఆర్ ప్రకటించాలన్నారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా 3000 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత ప్రయాణంకు కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని, అర్హులైన ఆర్‌టిసి ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఆర్‌టిసిలో ఖాళీగా ఉన్న పదివేల మంది సిబ్బంది నియామకాలు కు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని అన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్‌టిసినే సొంతంగా కొనుగోలు చేయాలని, వాటిని ఆర్‌టిసి సిబ్బందితోనే నిర్వహించాలని, పెండింగ్ డిఎలు, బకాయిలతో సహా చెల్లించాలని, డబుల్ డ్యూటీ చేసే సిబ్బంది డిడి మొత్తాన్ని పెంచాలని, కాలంచెల్లిన బస్‌ల బ్రేక్ డౌన్‌కు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమ చార్జ్ షీట్‌లు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేయాలని, సర్క్యులర్ నెంబర్ 01/19 యధావిధిగా అమలు జరిగేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ కె.శ్రీను, భాషా, బిఎన్.రాజు, శివ, కె.శ్రీనివాస్, సువర్ణ రాజు, మురళీ, ఆర్‌ఎల్.కుమారి, సలేషా, ప్రకాష్ పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ

నరసాపురం : మహిళా సర్పంచులు గ్రామాల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు గుర్తుండేలా పనిచేయాలని పలువురు మాస్టర్ ట్రైయినీలు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'మహిళా సాధికారతతో సుపరి పాలన సాధ్యం' అనే అంశంపై మహిళా సర్పంచులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు మాస్టర్ ట్రైయినీలు మాట్లాడారు. గ్రామ పాలనలో స్వతంత్రంగా వ్యహరించి ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి అర్హులైన వారికి వర్తించే విధంగా కృషిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు నిత్యావసరాలైన తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులను పంచాయతీ పాలనలో పరిగణలోకి తీసుకుని ముందుకు సాగడం ద్వారా గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న పలువురు సర్పంచులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. మాస్టర్ ట్రైయినీలు కెకె.విశ్వనాథం, విఎన్.కళ్యాణి, పి.సరళ, కె.సునీతా దేవి పాల్గొన్నారు. మహిళా సర్పంచులకు ఎంపిపి మైలాబత్తుల సోని ధ్రువ పత్రాలు అందజేశారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




ప్రచార ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనంలో చిటికిన రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం చుక్కా అప్పలస్వామి భవనం నుంచి స్థానిక పోలీస్ ఐ ల్యాండ్ వరకు సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, ఉద్యోగులు, వ్యవసాయ కార్మికులు యావత్తు ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 45 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని, అందులో 9 కోట్ల మందికే అరకొర సదుపాయాలు ఉన్నాయని, మిగతా 36 కోట్లమందికి ఎటువంటి సదుపాయాలు లేవని ఆయన అన్నారు. దేశ సంపదను లూటీ చేస్తున్న మోడీ మిత్రులు అదానీ, అంబానీలకు ప్రయోజనాలు చేకూర్చడం ఎంతవరకు సమంజసమని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, చిటికిన రాము, అయినాల సత్యనారాయణ, అడపా లోవ, యడ్ల శ్రీను, దాసరి రాజు, సుందరపు అప్పలనాయుడు, వెదుళ్ల రమణారావు, రౌతు పాపినాయుడు, ఇల్ల గోవిందరావు, పెంటకోట గోవిందు, బద్ది నాగేశ్వరరావు, చిట్టేటి సత్య నారాయణ, బుద్దాల తాతారావు పాల్గొన్నారు.

ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు చింతకాయల బాబురావు పిలుపునిచ్చారు. సిఐటియు మండల కమిటీ సమావేశం శనివారం పట్టణ సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జరుగనున్న జాతీయ సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు సిరుపరపు రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ తాడేపల్లిగూడెం మండల నాయకురాలు దీనాస్వరూప రాణి, మిడ్ డే మీల్స్ జిల్లా నాయకురాలు నాగమణి, తుంగ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.


'రైతు సేవే లక్ష్యంగా సహకార సంఘాలు'



అండలూరులో ప్రతిజ్ఞ చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

వీరవాసరం : రైతుల సేవలే లక్ష్యంగా సహకారం సంఘాలు పనిచేస్తున్నాయని సహకార సంఘాల జిల్లా అధికారి సంకు మురళీకృష్ణ అన్నారు. 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం అండలూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ సహకార సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి అవసరమైన నిధులు జిల్లా కేంద్ర బ్యాంకు నుంచి తీసుకోవచ్చునన్నారు. రైతులకు పారదర్శకంగా సేవలందించాలన్న లక్ష్యంతోనే అన్ని సహకార బ్యాంకులకు కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార సంఘాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రిత్వ శాఖ ఏర్పడటంలో సహకార సంఘాల అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. రోజువారి పనులన్నీ కంప్యూటర్‌లోనే నిర్వహిస్తున్నామన్నారు. రైతుల అవసరార్థం జిల్లాలో 21 గిడ్డంగులకు గాను 14 నిర్మాణం పూర్తై అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైతే వీటిని అద్దెకు ఇవ్వడం జరుగుతున్నారు. సహకార వ్యవస్థలో లోపాలు లేనపుడే సంఘాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. రానున్న కాలంలో నేషనల్ బ్యాంకుల తరహా సేవలందించడం జరుగుతుందన్నారు. సహకార సంఘ వారోత్సవాలలో భాగంగా గత ఐదు రోజులుగా వివిధ సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంఘం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారులు జి.సత్యనారాయణ, శీలబోయిన శ్రీనివాసరావు, రామదాసు, సంఘ పర్సన్ ఇన్‌ఛార్జి ఇ.హాస్పెస్, సిఇఒ లింగం శ్రీనివాస్, డిసిసిబి బ్రాంచి మేనేజర్ మమత, సూపర్‌వైజర్ ఎల్‌వి.సత్యనారాయణ, అడపా నాగరాజు, యార్లగడ్డ శ్రీనివాస్, అడబాల ఎస్‌వి.రామలింగేశ్వర్రావు పాల్గొన్నారు.

ఉండి : దేశవ్యాప్తంగా సహకార సంఘాల బలోపేతానికి కృషి జరుగుతుందని పెదపుల్లేరు విశాల పరపతి సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి కె.పణికుమార్ అన్నారు. 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం సహకార సంఘం ప్రాంగణంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార వ్యవస్థ రోజురోజుకీ బలోపేతం అవుతుందని, పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల పాత్ర ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సహకార రంగంలో మూడవ అంచెలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సేవలను విస్తృతం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. దీనిలో భాగంగా సహకార సంఘాల కంప్యూటరైజేషన్ జరుగుతోందన్నారు. దీని ద్వారా సహకార సంఘాలపై మరింత నమ్మకం, పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. దేశంలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు వికసిత భారత్ నిర్మాణంలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రాల్లోని సహకార రంగానికి చెందిన వివిధ చట్టాల్లో మార్పులు తీసుకువస్తున్నారని, గ్రామీణ స్థాయిలోని సహకార సంఘాలను కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, ఇతర కార్యక్రమాలకు కూడా విస్తరించాలని నిర్ణయించారని చెప్పారు. అనంతరం పెదపుల్లేరు సహకార సంఘం కార్యదర్శి కలిదిండి వర్మ మాట్లాడుతూ తమ సంఘం పరిధిలో రెండు గ్రామాలు ఉన్నాయని, 2400 మంది సభ్యులు ఉన్నారని వారి ద్వారా సంవత్సరానికి రూ.30 కోట్ల టర్నోవర్ జరుగుతుందని, రైతులకు అవసరమైన ఎరువులు అందిస్తూ వారు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లును సైతం ఏర్పాటు చేశారని, రైతుల సహకారంతో సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం సభ్యులందరూ సహకార సంఘంలో తమ వంతు బాధ్యతలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



ఉండిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



సీతారామయ్యను అభినందిస్తున్న ఎస్‌టియు యూనియన్ నాయకులు

ఎంఇఒ-2గా సీతారామయ్య బాధ్యతలు

కాళ్ల : కాళ్ల ఎంఇఒ-2 వెంకటేశ్వరరావు ఉద్యోగవిరమణతో ఎంఇఒ-2గా ఆకివీడు మండలం ఎంఇఒ-2గా పనిచేస్తున్న సీతారామయ్యని నియమించారు. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 సీతారామయ్యను మండల ఉపాధ్యాయులు, ఎస్‌టియు నాయకులు, మండల శాఖ ఎస్‌టియు అధ్యక్షులు వంకా గణేష్, ప్రధాన కార్యదర్శి పాపారావు, ఫైనాన్స్ సెక్రటరీ శ్రీనాగప్రసాద్, ఎస్‌టియు మండల అసోసియేట్ అధ్యక్షుడు పెరుమాళ్ల ప్రసాద్, ఎస్‌టియు వెస్ట్ గోదావరి జనరల్ సెక్రటరీ, వెస్ట్ గోదావరి జిల్లా ఉపాధ్యాయ సంఘాలు, ఉమ్మడి ఐక్యవేదిక కన్వీనర్ పెన్మెత్స ఆర్‌విఎస్.సాయి వర్మ అభినందించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్



కాళ్ల : జువ్వలపాలెం గ్రామ మాజీ సర్పంచి కొండేటి శివకుమార్‌ను వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడిగా వైసిపి నియమించింది. ఈమేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ బాధ్యతను తనకు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నారు. గతంలో నియోజకవర్గం బూత్ స్థాయి కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. కొండేటి శివకుమార్‌ను వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడుగా నియమించడం పట్ల మండలంలోని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నెగ్గిపూడిలో డిపిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి గ్రామ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) పి.రామ్‌నాథ్ రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పంచాయతీ నిర్వహణా తీరును సమీక్షించి, పలు కీలక అంశాలను పరిశీలించారు. స్థానిక కార్యాలయంలో ఉన్న రికార్డులు, హాజరు రిజిస్టర్లు, ప్రభుత్వ పథకాల అమలు వివరాలు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పాలన సమర్థవంతంగా కొనసాగుతోందని గుర్తించి, పంచాయతీ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే సచివాలయ సిబ్బందితో నేరుగా సమావేశమై వారి విధి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందే సేవలు వేగంగా, పారదర్శకంగా ఉండాలనే విషయాన్ని డిపిఒ సూచించారు. పంచాయతీ కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ శ్రీరామ్‌రెడ్డి, కూటమి నాయకులు బాలాజీ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వరి విత్తనాలు అందించటమే లక్ష్యం

ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

వ్యవసాయం చేసే ప్రతి రైతుకీ ప్రధానంగా అవసరమైనది నాణ్యమైన విత్తనమని, అలాంటి విత్తనాలు వారికి అందివ్వడమే తమ లక్ష్యమని, ఈ దిశగా మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం రైతులకు నాణ్యమైన వరి విత్తనాలు అందించటంలో ముందంజలో ఉందని ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సార్వాకు రైతులు సాగుచేసే వివిధ వరిరకాల విత్తనాలను అధిక మొత్తంలో మే నెల నుంచి రైతులకు సరఫరా చేయటం జరిగిందని అన్నారు. ఫారం ద్వారా ఎంటియు 1318 రకం, 33.6 లక్షల విలువైన 800 క్వింటాళ్ల విత్తనం అందించామని, అలాగే సన్నగింజ రకాలైన ఎంటియు 1262 రకం 23.5 లక్షల విలువైన 500 క్వింటాళ్ల విత్తనాన్ని, ఎంటియు 1224 రకం 14.1 లక్షల విలువైన 300 క్వింటాళ్ల విలువైన విత్తనాలు అందించామని తెలిపారు. ఎంటియు 1121 రకం 4.6 లక్షల విలువైన విత్తనాలు 120 క్వింటాళ్లు, ఎంటియు 3626 రకం 2.94 లక్షల విలువైన 70 క్వింటాళ్లు అందించటం జరిగిందని తెలిపారు. మొత్తంగా ఈ సార్వాకు రైతాంగానికి 78.74 లక్షల విలువైన 1790 క్వింటాళ్ల ఫౌండేషన్ విత్తనాన్ని అందించటం జరిగిందని అన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానానికి చెందిన వివిధ రకాల వరివిత్తనాలు ప్రధానంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల రైతాంగానికి అందజేయటం జరిగిందన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విత్తనం పొందిన రైతులు పంట కాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి, కేళీలు తీసుకొని ఆ విత్తనాన్ని దాచుకొని, తరువాత మూడు పంట కాలాల వరకూ విత్తనాలుగా వాడుకొని సాగు ఖర్చు తగ్గించుకోవలసిందిగా ఎడిఆర్ సూచించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

తక్కువ ఫీజులతో తమ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో చక్కటి విద్య అందించడమే కాకుండా, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వడం ఆనందకరమని స్థానిక పెనుమంట్ర గరువు ఆంధ్ర అసోసియేషన్(యుకె) జూనియర్ కాలేజీ పాలకమండలి ప్రెసిడెంట్ డాక్టర్ తేతలి గుర్రెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం కళాశాల ప్రాంగణంలో జరిగిన ప్రతిభా విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గడచిన రెండు సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పరీక్షల్లో చక్కటి ప్రతిభతో మంచి మార్కులు సాధించిన వారికి గోల్డ్, సిల్వర్ మెడల్స్, మెమెంటోలతో పాటు నగదు బహుమతులు అందించారు.

ఇంటర్ ఎంపిసిలో 988 మార్కులతో స్టేట్ 5వ ర్యాంక్ సాధించిన విఎన్‌ఎస్‌ఎల్.కామాక్షికి గోల్డ్ మెడల్‌తో పాటు రూ.5 వేల నగదు అందించారు. బిఎల్.శ్రేష్ట, బి.పల్లవిలకు గోల్డ్ మెడల్స్, జి.హర్షిత, టి.భూమిక, కె.గీతలకు సిల్వర్ మెడల్స్ అందించారు. రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను కె.ఆదిత్యా రెడ్డి, ఎస్‌టి.సాయి సంతోషి, ఆర్.రామకిశోర్‌లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకమండలి కార్యదర్శి టి. రామారెడ్డి, ట్రెజరర్ సత్యానంద రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.కృష్ణారెడ్డి, సభ్యులు కె.నాగిరెడ్డి, టి.కృష్ణారెడ్డి, డాక్టర్ ఎంఎన్.విజయ సింహా రెడ్డి, ప్రిన్సిపల్ ఎ.సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగే మెగా పిటిఎంలో విట్నెస్ అధికారి ని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకొని, వారి వివరాలు మొత్తం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసి వారి చేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి మీద, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల మీద మాట్లాడుకోవటానికి 17 రకాల కమిటీలు, ఫొటోలు, అప్లోడ్లు, విద్యాశాఖకు చెందని ఒక ప్రభుత్వ ఉద్యోగిని విట్నెస్ అధికారిని నియమించడం ఎవరు చేయాలి? ప్రభుత్వ ఉద్యోగులు అన్ని చోట్ల ఉన్నారా? ఉన్నా సెలవు పెట్టి రాగలరా? ఉపాధ్యాయులు వీళ్ల కోసం గాలించడం, బడి దారిన బడి పోవడం ఇంత తతంగం అవసరమా? అని అన్నారు. పేరెంట్స్ మీటింగ్‌ని డాక్యుమెంట్రీ కార్యక్రమంగా మార్చడం సరికాదని, విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దాన్ని చూడాలని అన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగించడం సరికాదని అన్నారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల లోపే యోగా పేరుతో వారం రోజులు, మెగా పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయం హరించుకుపోయిందని తెలిపారు. ఒకపక్క విద్యార్థుల అవుట్‌పుట్ కోసం పర్యవేక్షణ అధికారులు వస్తారని చెబుతూ మరో పక్క బోధనేతర కార్యక్రమాలు పెంచుతూ వాటి చుట్టూ ఉపాధ్యాయులను తిప్పుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా బోధనేతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడికి గురిచేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. కార్యక్రమాల ప్రాధాన్యత అవసరమైన మేరకు మాత్రమే ఉండాలని అన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు మెగా పిటిఎంలో విట్నెస్ అధికారిని నియమించుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం : కలెక్టర్

మొగల్తూరు : జిల్లాని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ గ్రామాలలో విస్తరించి ఉన్న బీచ్ ప్రాంతాన్ని టూరిజం శాఖ జిల్లా అధికారి అడబాల వెంకట అప్పారావుతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. బీచ్‌కు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం టాయిలెట్స్, డ్రెస్ చేంజింగ్ రూమ్, కాపిటేరియా రెండు బ్లాక్లుగా నిర్మాణాలు చేపట్టినందుకు పర్యాటక శాఖ నుంచి రూ.25 లక్షల నిధుల మంజూరు అయ్యాయని అన్నారు. వాటి నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించేందుకు బీచ్ ప్రాంతాన్ని సందర్శించారు. పర్యాటకులకు అణువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులు ఆదేశించారు. త్వరలో వాటర్ స్పోర్ట్స్ సంబంధించి టెండర్స్ పిలవడానికి నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వారి వెంట తహశీల్దార్ కె.రాజకిషోర్, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహన్ రావు, పంచాయితీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు పలువురు సిబ్బంది ఉన్నారు.

పంచాయితీ సెక్రటరీల సమస్యలపై వినతి

పాలకొల్లు రూరల్: పంచాయితీ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా యూనియన్ అధ్యక్షులు పాల శారద శ్రీనివాస్ డిపిఒ నూకల రామనాథరెడ్డికి వినతి పత్రాన్ని భీమవరంలోని ఆయన కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాల శారద శ్రీనివాస్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి పారిశుధ్య పనులు మొదలు రాత్రి 8 గంటల వరకు విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సామరస్య పూర్వకంగా మా సమస్యలను పరిష్కరించాలని డిపిఒను కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పాలకొల్లు రూరల్: మండలంలోని సగం చెరువు గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్ ఎస్‌ఆర్ పేటలో విద్యార్థులకు పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉద్యోగి అయిన కవురు వెంకటసుబ్బయ్య రాత పుస్తకాలను శనివారం అందజేశారు. సుబ్బయ్యను గ్రామస్తులు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టి పెరిగిన గ్రామం, చదువుకున్న స్కూల్లో ఇటువంటి కార్యక్రమంలో తాను భాగస్వామ్యుడిని కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ కుడిపూడి అనిత, టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, సర్పంచి కడలి నాగమణి పాల్గొన్నారు.